క్లుప్తంగా

97.98 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు

ఏవో ఆర్. వెంకటేశ్వరరావు



పొన్నూరు: ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా, డీఏపీ సరఫరా అవుతోందని ఏవో ఆర్. వెంకటేశ్వరరావు అన్నారు. ఇప్పటి వరకు మండలానికి 3185 మెట్రిక్ టన్నుల యూరియా, 1114 టన్నుల డీఏపీ, 896 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్‌లు, 285 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి, 5.9 టన్నుల పొటాష్, ఎరువులు మండలంలో దిగుమతి అయ్యాయని తెలిపారు. శనివారం నిల్వ ఉన్న యూరియాను పరిశీలించి వివరాలు వెల్లడించారు. వాటిలో 97.98 మెట్రిక్ టన్నుల యూరియా, 130.45 మెట్రిక్ టన్నుల డీఏపీ, 350.6 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 87.5 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి, 5.9 టన్నుల పొటాష్ ఎరువులు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికీ అవసరానికి సరిపడా ఎరువులు మాత్రమే కొనుగోలు చేయాలని రబీ సీజన్‌కు నిల్వ ఉంచుకోవద్దని సూచించారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



కాకుమాను: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కాకుమానులో శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి రోజు స్వచ్ఛ ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. గ్రామాలలో పారిశుద్ధ్యం పై అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుగకీర్తి, తహసీల్దార్ వెంకటస్వామి, ఈవోపీఆర్డీ రవిబాబు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

యువతకు ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా జూనియర్ కళాశాలలో శనివారం అడాల్‌సెంట్ ఏజ్ హెల్త్ అండ్ హైజీన్‌పై ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు సర్వైకల్ వాక్సిన్ గురించి విద్యార్థినులతో చర్చించారు. మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై వారి సందేహాలను నివృత్తి చేశారు. అవగాహన సదస్సును కళాశాల ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు బిందు, వాణిలత, వాణిగ్రేస్ పర్యవేక్షించారు.

అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాజేష్

నెహ్రూనగర్: అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బోరుగడ్డ రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. నగరంలో సంఘ కార్యవర్గ సమావేశం శనివారం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. అందులో రాజేష్‌కుమార్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ వీరాస్వామి నియామక పత్రం జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

తమ్ముడిపై పెట్రోలు పోసి నిప్పంటించిన అన్న

నగరంపాలెం: తమ్ముడిపై అన్న పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటన శుక్రవారం రాత్రి నగరంలో చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డితోటకు చెందిన కె.సురేష్ ఆటోడ్రైవర్. పదేళ్ల కిందట అతను మీరాబీని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. అయితే, సురేష్‌కు పెద్ద అన్న రమేష్‌తో విభేదాలున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మణిపురం బ్రిడ్జి సమీపాన సురేష్‌పై రమేష్ పెట్రోలు పోసి నిప్పంటించాడు. స్థానికులు గుర్తించి, సురేష్ భార్యకు సమాచారం అందించారు. మంటల్లో గాయపడిన భర్తను భార్య జీజీహెచ్‌లో చేర్పించగా, పాత గుంటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 2/3వ అడ్డరోడ్డులోని వైన్‌డీలర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం మొబైల్‌షాప్ ఓనర్స్, టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష పదవికి మొహమ్మద్ మోబీన్ బాషా, షేక్ బాబు (సెల్‌బాబు), కార్యదర్శి పదవికి పఠాన్ జుబేర్‌ఖాన్, తియ్యా వేణుగోపాల్ పోటీ పడుతున్నారు. కోశాధికారిగా షేక్ జిలాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్లు కొనసాగనుంది. అసోసియేషన్‌లో 300 మంది సభ్యత్వం ఉన్నారు. ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు ఎన్నికలు జరగనున్నాయి.

ఘనంగా టంగుటూరి జయంతి



ఎన్జీరంగా వర్శిటీలో నివాళులు అర్పిస్తున్న అధికారులు



నివాళులు అర్పిస్తున్న సమాఖ్య నాయకులు

పెదకాకాని: మద్రాసులో సైమన్ కమీషన్‌కు వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీకి ఎదురుగా గుండె చూపించి ఆంధ్రకేసరి అని పేరు పొందిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని గ్రంథాలయాధికారి నంద్యాల నాగిరెడ్డి అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో శనివారం ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలు జరుపుకున్నారు. ముందుగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోదరాయుని పాలెం గ్రామంలోని యోగి బ్రహ్మణులైన సుబ్బమ్మ, గోపాలకృష్ణ దంపతులకు జన్మించారన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన టంగుటూరి ప్రకాశం పంతులు వారాలు చేసుకుంటూ చదువుకుని ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో టంగుటూరి ప్రకాశం ఒకరని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు శతక పద్యాలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్శిటీలో..

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం ఆంధ్ర కేసరి ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి నివాళులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులు అర్పించి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి వచ్చి కష్టపడి నిబద్ధతతో, ధైర్య సాహసాలను ప్రదర్శించి తెల్లదొరలను ఎదురొడ్డిన నాయకులు ప్రకాశం పంతులని కొనియాడారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్యలో..

గుంటూరు రూరల్: తెల్లదొరలను ఎదిరించిన ధీరుడు యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ కొనియాడారు. శుక్రవారం నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు నందున్న సంఘం రాష్ట్ర కార్యాలయం నందు ఆంధ్ర ప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి సభను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి పులిపాక ప్రసాద్, కార్య నిర్వహణ కార్యదర్శి రావూరి ఆంజనేయులు, రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నాయకులు పాండురంగ విఠల్, గుంటూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు లలితశాస్త్రి, ప్రధాన కార్యదర్శి మాచిరాజు మురళికృష్ణ, రాష్ట్ర సభ్యులు మాటేటి నాగరాజు, పులిజాల సాంబశివరావు, మాదిరాజు తరుణ్, మద్దాలి రాంబాబు, గొల్లపూడి గిరిభూషణరావు, పవన్ పాల్గొన్నారు.

వేర్వేరు కళాశాలల్లో హాకథాన్ సదస్సు



మలినేనిలో విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం



సిబార్‌లో క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఆన్‌లైన్ బూట్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల కోసం 36 గంటల పాటు నిర్వహించిన హాకథాన్ విజయవంతంగా ముగిసింది. శనివారం నిర్వహించిన పోటీలో 28 జట్లు, మొత్తం 140 మంది విద్యార్థులు పాల్గొని, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ తదితర విభిన్న రంగాలలోని వాస్తవ సమస్యలకు 28 సృజనాత్మక ఆలోచనలు ద్వారా వినూత్న పరిష్కారాలను అందించారు. ఉత్తమంగా నిలిచిన టాప్ 3 జట్లకు మొత్తం రూ 20,000 రూపాయల నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి మేక్‌స్కిల్డ్ బృందం మెంటర్లుగా మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో నిఘాటెక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థపక సీఈవో పావన్ విజయ్‌కుమార్ మంథి మాట్లాడుతూ ఏఐ ప్రాధాన్యత వివరించారు. ప్రస్తుతం ప్రతి రంగంలోనూ వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు, వైద్య సేవల నుంచి స్మార్ట్ సిటీల వరకు ఏఐ, ఎల్‌వోటీలు సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయన్నారు. ఈ టెక్నాలజీలలో నైపుణ్యం సంపాదించడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు మార్గదర్శకులవుతారన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ నూతన సాంకేతికతలపై పట్టు సాధించడం, ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించడం ప్లేస్‌మెంట్‌లో కీలకమన్నారు. ఇలాంటి హాకథాన్‌లు విద్యార్థుల్లో క్రియేటివిటీ, టీమ్‌వర్క్ సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ హాకథాన్‌లో విద్యార్థులు చూపించిన ఉత్సాహం, ఉత్పత్తి అభివృద్ధిలో వారి కృషి, సమయపాలన అద్భుతమని అభినందించారు. డాక్టర్ డి విజయసారధి మాట్లాడుతూ మన విద్యార్థులు రెండో సంవత్సరం నుంచే ఇలాంటి టెక్నికల్ ఈవెంట్స్‌లో చురుకుగా పాల్గొంటున్నారని, భవిష్యత్తులో ఇదే ఉత్సాహం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సిబార్‌లో ...

పెదకాకాని: క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలుగుతుందని సిబార్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి.రమణారెడ్డి తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల విద్యార్థులు శనివారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. ఈ ఆన్‌లైన్ బూట్ క్యాంపులో కళాశాలకు చెందిన మూడు జట్లలో 18 మంది విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవం



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

గుంటూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలోగల సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి.సంధ్య మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా ప్రతి ఏటా ఆగస్టు 23ని భారతదేశం నేషనల్ స్పేస్ డేగా పరిగణించిందన్నారు. అంతరిక్ష పరిశోధన రంగంలో పురుషులతోపాటు మహిళలు ముందంజలో రాణిస్తున్నారన్నారు. మనం నేర్చుకునే విద్యతోపాటు యువత అంతరీక్షం పరిశోధనలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన అంతరిక్ష ఎగ్జిబిషన్, పోస్టర్ ప్రజంటేషన్, రాకెట్ లాంచింగ్, పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి రామారావు జీ శాంతకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయి సదస్సు



గుంటూరు రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రత్తి పంటలో తగిన యాజమాన్య పద్ధతులు చేపట్టి పంటలను కాపాడుకోవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ప్రత్తి పంటలో చేపట్టాల్సిన కలుపు, అంతర కృషి, పోషక తదితర యాజమాన్య పద్ధతులపై రైతులకు క్షేత్రస్థాయి సదస్సు నిర్వహించారు. పంట తొలిదశలో చేపట్టాల్సిన కలుపు నివారణ పద్ధతులు గురించి తెలిపారు. వర్షాలు ఎక్కువగా ఉండి అంతర్ కృషి చేపట్టలేని సమయంలో ఎకరానికి ఒక లీటరు పారాక్వాట్ 24శాతం ఎస్ఎల్ మందును 200 లీటర్ల నీటికి కలిపి ప్రత్తి పంటపైన పడకుండా గరాటును అమర్చి వరుసల మధ్యన కపుపుపైన మాత్రమే పడేవిధంగా పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు అధికారులు రావెప్ విద్యార్థులు పాల్గొన్నారు.

మందు బాబులు ముగ్గురిపై కేసు నమోదు

లక్ష్మీపురం: బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు. చుట్టుగుంట, కె.వి.పి కాలనీ వీఐపీ రోడ్డులో శనివారం రాత్రి నగరంపాలెం పోలీసులు తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ముగ్గురు బహిరంగంగా మద్యం తాగుతున్నట్లు గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు.

అప్పాజోస్యులకు కళా విపంచి పురస్కారం



సత్యనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు



'పాప దొరికింది' హాస్య నాటికలో సన్నివేశం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో జరగ్గా, గౌరవాధ్యక్షులు రామరాజు శ్రీనివాసరావు సభాధ్యక్షత వహించారు. అనంతరం ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. పలు రంగాల్లో, దేశ విదేశాలలో తెలుగు అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి మరువ లేనిదని వక్తలు కొనియాడారు. ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గోవిందరాజులు నాగేశ్వరరావు రచన, నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించిన పాప దొరికింది (హాస్య నాటిక) నాటిక ఆహూతులను అలరించింది. సభలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ సాహితీవేత్త కందిమళ్ల సాంబశివరావు, సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు కేసీపీ సిమెంట్ వజ్జా మధుసూదనరావు, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కళాపోషకులు డి.రామకోటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కళాకారులను, అతిథులను సత్కరించారు.

యువతకు ఆర్థిక అక్షరాస్యత అవసరం



రిసోర్స్ పర్సన్ విజయ్‌కుమార్‌తో ప్రిన్సిపాల్ గోపీచంద్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: యువతకు ఆర్థిక అక్షరాస్యత అవసరమని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ పేర్కొన్నారు. కళాశాలలో కోటక్ సెక్యూరిటీస్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ ఆధ్వర్యంలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఆర్థిక పరిజ్ఞానంపై రెండు రోజుల పాటు నిర్వహించిన సర్టిఫికెట్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపీచంద్ మాట్లాడుతూ విద్యార్థులు, యువతరంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆర్థిక అంశాలపై అవగాహన, క్రమశిక్షణ అవసరమని తెలిపారు. కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ మాట్లాడుతూ స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. రిసోర్స్ పర్సన్ చిలుకూరి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పెట్టుబడి ప్రాధాన్యత, సెక్యూరిటీ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి జాగ్రత్తలు, పెట్టుబడిదారుల రక్షణ, ఫిర్యాదుల పరిరక్షణ యంత్రాగం, ఆర్థిక అక్షరాస్యత, బడ్జెట్, పొదుపు, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అనేక రకాల ఫైనాన్షియల్ సెక్యూరిటీ మార్కెట్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఎం. అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వ రహస్యాల అన్వేషణలో ఇస్రో విశేష కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్వ రహస్యాల అన్వేషణలో ఇస్రో విశేష కృషి అసామాన్యమని పూర్వ ఇస్రో, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మంగళగిరి మండలం కాజాలోని ఎస్ఎస్‌వీ ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు అంతరిక్ష అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ చంద్రయాన్–3లో భాగంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా ల్యాండ్ అయిన విజయానికి గుర్తుగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అంతరిక్ష పరిజ్ఞానంపై భావితరాలకు అవగాహన కలిగించేందుకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆర్యభట్ట నుంచి గగన్‌యాన్ వరకు ప్రాచీన నుంచి అనంతమైన అవకాశాలు అనే అంశంపై ప్రస్తుత ఏడాది అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారని వివరించారు. చిల్డ్రన్ స్పేస్ క్లబ్ అధ్యక్షుడు జి.శాంతమూర్తి మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2040లో చంద్రునిపైకి మానవులను పంపేందుకు పరిశోధనలు సాగిస్తోందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



మొక్కలు నాటుతున్న చీఫ్ వార్డెన్ ఆచార్య కె.మల్లికార్జున

పెదకాకాని(ఏఎన్‌యూ): సామాజిక ప్రయోజనాల కోసం మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకుందామని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య కె.మల్లికార్జున అన్నారు. పర్యావరణం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శనివారం యూనివర్సిటీ బాలుర వసతి గృహాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చీఫ్ వార్డెన్ ఆచార్య కె.మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. నాటిన ప్రతీ మొక్కను బాధ్యతగా సంరక్షించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం ప్రాముఖ్యతపై దృష్టిని కేంద్రీకరించడం, చెట్ల స్పృహను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని చెప్పారు. వసతి గృహాల సుందరీకరణలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు, సిబ్బంది, వార్డెన్లు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బాలుర వసతి గృహాల అడిషనల్ వార్డెన్లు డాక్టర్ డి.శ్రీనివాసరావు, డాక్టర్ బాల మురళి, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ ఎస్.బాబు, డాక్టర్ కె శశిధర్, పార్థసారథి, డాక్టర్ వెంకట శేఖర్, డాక్టర్ నాగరాజు, డి.ఆర్. గోవిందరావు, శ్రీనివాసరావు, వరకుమార్, రెసిడెన్షియల్ వార్డెన్లు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన



ఈ పంటనమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి అయిత నాగేశ్వరరావు ఈపంట నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. గ్రామంలో జరిగే వ్యవసాయ శాఖకు చెందిన అన్నదాత సుఖీభవ పథకం, ఎరువుల సరఫరా, కౌలు రైతు గుర్తింపు కార్డుల డేటా వాటి అమలు గురించి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ని అడిగి తెలుసుకున్నారు. రైతు సోదరులు పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రంలో వీఏఏని కలిసి పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇంకా ఎవరికైనా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు ఎవరైనా లబ్ధి పొందకపోతే రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవడానికి ఆగస్టు 25న ఆఖరు తేదీ అని చెప్పారు. ఎన్‌పీసీఐ ఇన్ ఆక్టివ్ జాబితాలో వున్న రైతులు వారికి సంబంధిన బ్యాంక్‌కి ఎన్‌పీసీఐ ఆక్టివ్ చేయించుకోవాలని తెలిపారు. లేదా భారత తపాలా కేంద్రాలలో అకౌంట్ ఓపెన్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ అమౌంట్ ఆఅకౌంట్‌లో పడతాయని చెప్పారు. కౌలు రైతు గుర్తింపు కార్డుల ఆవశ్యకతను వివరించి ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డును తీసుకోవలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ షరీఫా గ్రామ రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు



కాలువలు శుభ్రం చేస్తున్న కమిషనర్

పొన్నూరు: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులను నివారించగలమని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా వర్షాలు పరిశుభ్రత అంశంతో శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రతలు, రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ఇటికంపాడు రోడ్డులోని కాలువలలో పూడికలను తీయించారు. దోమల నివారణకు మలాధియన్ ఎబెట్ మందును కాలువలందు స్ప్రే చేయించారు. 17 సచివాలయాల పరిధిలో కాలువలు శుభ్రం చేసి ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కళ్లం కళాశాలలో అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం గ్రామంలోగల కళ్లం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన క్వాంటమ్ వ్యాలీ– 2025 హ్యాకాథాన్ అవగాహన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎమ్ ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులో విద్యార్థులకు నూతన టెక్నాలజీగా అభివృద్ధి చెందుతున్న క్వాంటమ్ టెక్నాలజీని ఎలా అభివృద్ధి చేయవచ్చు వివరించారన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్వహిస్తున్న హ్యాకాథాన్ పోటీలలో ప్రతి విద్యార్థి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోటీలు కళాశాల, రీజనల్ రాష్ట్ర స్థాయిలో జరుగుతాయని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పోటీలలో కళ్లం ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొంటున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధికల్పన అధికారి డాక్టర్ పి ఎల్ మాధవరావు, హ్యాకాథాన్ పోటీల నిర్వాహకురాలు డాక్టర్ బి బిందుమాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

చేబ్రోలు: యువత హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ సంస్థ జోనల్ సూపర్‌వైజర్ బి నాగేశ్వరరావు అన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్ మరియు మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ ఆదేశాలు మేరకు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ పర్యవేక్షణలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ప్రాజెక్ట్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించింది. ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత శుభ్రత పట్ల శ్రద్ధ వహించి ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు అలవాటుపడి ఆరోగ్యాన్ని పాడు చేసుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయకుమార్, ఏడుకొండలరావు, గణేష్ కస్టర్ లింక్ వర్కర్స్ గాయత్రి, జాన్ బనియన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీపీ పల్లపు కృష్ణకు సత్కారం



కృష్ణను సత్కరిస్తున్న జడ్జి నీలిమ, కోర్టు సిబ్బంది

నగరంపాలెం: గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించిన పల్లపు కృష్ణ శనివారం రిలీవయ్యారు. జిల్లా కోర్టు ఆవరణలో ఆయన్ను జడ్జి కె.నీలిమ, కోర్టు సిబ్బంది సత్కరించారు. 18 నెలలు సమర్థంగా ప్రాసిక్యూషన్ నిర్వహించి, తొమ్మిది కేసుల్లో శిక్షలు పడేలా కృషి చేశారని వక్తలు ప్రశంసించారు. పల్లపు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నాగార్జునసాగర్ పీఎస్ పరిధిలోని గిరిజన మహిళపై గ్యాంగ్ రేప్, మేడికొండూరు పీఎస్ పరిధిలో ఓ మహిళపై జరిగిన గ్యాంగ్ రేప్ కేసుల్లోనూ నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసినట్లు చెప్పారు. అరండల్‌పేట పీఎస్ పరిధిలోనూ మహిళా న్యాయవాదిపై జరిగిన హత్య కేసులోనూ నిందితులకు జీవిత ఖైదు పడిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కోర్టు ఏఓ, సిబ్బంది పాల్గొన్నారు.